క్లుప్తంగా

అభినందనలు


వాసుబాబును సత్కరిస్తున్న బండారు నాగరాజు

ఉంగుటూరు : మాజీ ఎమ్మెల్యే వాసుబాబును ఉంగుటూరు మండల ఎంపీటీసీ ఛాంబర్ అధ్యక్షుడు బండారు నాగరాజు సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వాసుబాబును ఘనంగా సత్కరించారు.

హోటళ్లపై అధికారుల దాడులు

దెందులూరు: మండలంలోని జాతీయ రహదారిపై సీతంపేట వద్ద మయూరి హోటల్‌లో సోమవారం దెందులూరు తహసీల్దార్ బి సుమతి ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా వాడుతున్న నాలుగు గ్యాస్ సిలిండర్లను గుర్తించి సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. దాడుల్లో సివిల్ సప్లై రెవెన్యూ అధికారులు, సీతంపేట వీఆర్‌ఓ విజిలెన్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు దెందులూరులో మండల సర్వసభ్య సమావేశం

దెందులూరు: దెందులూరు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొమ్మన బోయిన సుమలత అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో కే శ్రీదేవి తెలిపారు. మండలంలో ఎంపీటీసీలందరూ అన్ని శాఖల మండల అధికారులు విధిగా సమావేశానికి పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమడోలు : భీమడోలు విద్యుత్ స్టేషన్ పరిధిలోని పూళ్ల సబ్‌స్టేషన్ ఏరియాలో 22వ తేదీ మంగళవారం విద్యుత్ లైన్ల మరమ్మతులు, కొత్త లైన్ల ఏర్పాటు నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఈఈ కేఎం అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. పూళ్ల, కురెళ్లగూడెం, దుద్దేపూడి, ఇండస్ట్రియల్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

24 నుంచి వేసవి శిక్షణ తరగతులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశాల మేరకు స్థానిక పడమర వీధిలోని జిల్లా బాల భవనంలో ఈ నెల 24 నుంచి వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు బాల భవనం పర్యవేక్షకుడు జి.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తరగతుల్లో 6 నుంచి 16 సంవత్సరాలలోపు బాల బాలికలకు శాస్త్రీయ నృత్యం, చిత్రలేఖనం, గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, టైలరింగ్ విభాగాల్లో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. నిత్యం ఉదయం 7.30 గంటల నుంచి 10.30 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4.30 గంటల నుంచి 7.30 గంటల వరకు శిక్షణ ఉంటుందని వివరించారు. బాలభవన్ పర్యవేక్షకుడు రవికుమార్‌ను సెల్ ఫోన్ నెంబర్లు 99892 07515, 63097 90287లో సంప్రదించవచ్చని తెలిపారు.

రైతుల నుంచి ప్రతి గింజా కొనాలి

ఏలూరు (టూటౌన్): రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజా కొనుగోలు చేయాలని, రైతులకు, కౌలు రైతులకు వెంటనే గోనె సంచులు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం వారు స్థానిక పవరుపేటలోని అన్నే భవనంలో ధాన్యం కొనుగోలు సమస్యలపై మాట్లాడారు. గోనె సంచులు కొరత వల్ల అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చాలాచోట్ల ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తయిందని, గోనె సంచులు లేవని రైతు సేవా కేంద్రాలు చెప్పడం వల్ల దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుకు సరిపడా గోనె సంచులు సరఫరా చేయాలని, కళ్లాల్లో ఉన్న ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని కోరారు.

విద్యతో పాటు విలువల పెంపునకు కృషి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యతో పాటు విద్యార్థుల్లో విలువలు పెంపొందించేలా తమ విద్యా సంస్థ ఎప్పుడూ కృషి చేస్తుందని సిద్ధార్థ స్కూల్స్ చైర్మన్ కోనేరు సురేష్ బాబు అన్నారు. సోమవారం ఏలూరు, హనుమాన్ జంక్షన్‌లలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. విశ్వం ఐఐటీ ఫౌండర్ వెంకట్ మాట్లాడుతూ విద్యార్థులపై భారం లేకుండా వారి స్థాయికి అనుగుణంగా ఐఐటీ, నీట్ గురించి నేర్పేలా కాన్సెప్టులు రూపొందించినట్లు వివరించారు. ప్రిన్సిపాల్ పీఎస్‌ఆర్ కుమార్ మాట్లాడుతూ స్లో లెర్నర్లనూ ప్రోత్సహించడం తమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ సదస్సులో తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరక దొరికితే పండగే

- ఎండుగడ్డికి తీవ్ర కొరత
- పశుగ్రాసం కోసం రైతుల అవస్థలు



దెందులూరు: పాడి పంట జనజీవనంలో విడదీయరాని అనుబంధంతో కలిసిపోయాయి. వ్యవసాయ రంగంలో ఆధునికత పెరగడంతో పాడి పశువులకు గ్రాసం (ఎండుగడ్డి)దొరకని పరిస్థితులు ఎదురవుతున్నాయి. యంత్ర పరికరాల వినియోగంతో పశుగ్రాసానికి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. సాధారణంగా వ్యవసాయం చేసే రైతులకు పాడి సంపద కూడా తోడై ఉంటుంది. వ్యవసాయంలో దుక్కుల నుంచి పంట కోతలు, ధాన్యం, రవాణా తదితర పనులను గతంలో ఎక్కువగా పశువులతోనే చేసేవారు. వాటికి తోడు పాల ఉత్పత్తికి పాడి పశువులను పెంచుకొనేవారు. అందుకు పశుగ్రాసం ఎక్కువగా అవసరం ఉండేది. కాలక్రమేనా సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న క్రమంలో వ్యవసాయంలో పశువుల అవసరం క్రమేపీ తగ్గుతూ వస్తోంది. అయితే పాల ఉత్పత్తులకు మాత్రం పశువుల అవసరం ఉండడం వల్ల చాలా మంది రైతులు పాడి పశువులను పెంచుకుంటున్నారు. వారికి పశుగ్రాసం కొరత ఎక్కువగా కనిపిస్తోంది.

ఎండుగడ్డికి డిమాండ్

ఆధునిక వ్యవసాయ విధానాల్లో భాగంగా నాట్ల నుంచి కోతల వరకూ యంత్రాలను ఉపయోగిస్తున్న తరుణంలో పశుగ్రాసంగా ఎక్కువగా వినియోగించే ఎండుగడ్డికి తీవ్ర కొతర ఏర్పడుతోంది. పండిన పంటను కూలీల సాయంతో కోత కోయించి వాటిని పొలాలలోనే కుప్పలుగా పెట్టుకుని కొంతకాలం అయిన తరువాత రైతులు వారి కళ్లాలకు తీసుకువచ్చి నూర్పు చేసి గడ్డిని కుప్పలుగా వేసేవారు. దీనివల్ల ఎండుగడ్డికి కొరత ఉండేది కాదు. పశువులకు మేతగా వేసేవారు. ఎక్కువగా ఉండే గడ్డిని ఇతరులకు ఉచితంగా ఇచ్చేవారు. అయితే వరికోతలకు యంత్రాలు వినియోగించడం వల్ల ఎండుగడ్డి పరకలు ముక్క, ముక్కలు కావడంతో వాటిని రైతులు పంటపొలాల్లోనే వదిలేసి మంట పెట్టుస్తున్నారు. దీంతో ఎండుగడ్డి కొరత ఏర్పడుతోంది. ఎక్కడైనా కూలీల ద్వారా కోతలు జరిగితే అక్కడికి పాడిరైతులు పరుగులు తీసి గడ్డిని కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు.

ఎండుగడ్డికి ప్రత్యామ్నాయం లేదు

ఎండుగడ్డికి ప్రత్యామ్నాయం లేకపోవడంతో ముక్కలైన గడ్డికి కూడా ప్రస్తుతం డిమాండ్ పెరిగింది. ఇతర గ్రామాల్లో ఉండే గడ్డికోసం అక్కడికి వెళ్లి కొనుగోలు చేసి రవాణా ఖర్చులు పెట్టుకుని తెచ్చుకుంటున్నారు. ఒక నాటుబడి గడ్డి దూరాన్ని బట్టి కనీసం రూ.1000 ఉంటోందని రైతులు చెబుతున్నారు.

విద్యార్థులు వేసవిలో జాగ్రత్తలు పాటించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న గోవిందరావు

దెందులూరు: వేసవిలో పాఠశాల విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ గోవిందరావు అన్నారు. సోమవారం గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రోజా ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు అవగాహన సమావేశం జరిగింది. గోవిందరావు మాట్లాడుతూ దూర ప్రాంతాలు ప్రయాణించడం వల్ల, శరీరం నుంచి నీరు చెమట రూపంలో బయటకు పోతుందన్నారు. ఇలాంటి సమయాల్లో వడదెబ్బ తగిలే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. చిన్న పిల్లలు, విద్యార్థులు, గర్భిణులు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అధిక వేడిలో పనిచేయవద్దని కాటన్ దుస్తులు ధరించాలని, తలపాగా, టోపీ, గొడుగు, ఎక్కువగా ద్రవపదార్థాలు తీసుకోవాలని, ఎండ ప్రాంతాల్లో పనులు చేయకూడదని ఆయన సూచించారు. ఈ సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఉంగుటూరు: మండలంలోని మండలం బొమ్మిడి నెం1పాఠశాల వార్షికోత్సవం ఏఎంసీ చైర్మన్ యర్ర సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు బొమ్మిడి ప్రసాద్, రాజు ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. బొమ్మిడి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మీ పిల్లలను చేర్పించండి అని అన్నారు. మండల బీజేపీ నాయకులు దుర్గారావు మాట్లాడుతూ మన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ వెంకటలక్ష్మి, బొమ్మిడి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.శ్రీదేవి, జనసేన నాయకులు మద్దాల నాగరాజు, టి.డి.పి. నాయకులు భయ్యే సత్యనారాయణ, యుటిఎఫ్ నాయకులు, శీతాల సత్యనారాయణ, వునుముల రాంబాబు, జోగినాయుడు, శ్రీధర్, ఆనంద్, అల్లు శ్రీను, పుప్పాల నరసింహారావు, పాల్గొన్నారు. పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు


విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు

ఉంగుటూరు: మండలంలోని గోపీనాథ పట్టణంలో శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లికార్జున స్వామి, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్ల దివ్య విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవా ఘనంగా జరుగుతున్నాయి. మూడవ రోజు సోమవారం గణపతిపూజ, గోపూజ, మంత్రానుష్టానము, ఏకాదశ రుద్రాభిషేకం, తీర్థప్రసాద వినయోగ కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి బింబ సంస్కార హోమాలు, పర్యాయ హోమాలు, మహామృత్యుంజయ హోమం, రుద్ర హోమం, శివపరివార దేవతా హోమం, క్షీరాధివాస హోమం, క్షీరాధివాసము, నీరాజన మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, సాధని కుమారిల పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి.

తాత్కాలిక వంతెనపై రాకపోకలు బంద్

వంతెనకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది


గుండుగొలను వంతెనపై మరమ్మతులు చేస్తున్న దృశ్యం

భీమడోలు: గుండుగొలను గోదావరి కాల్వపై నిర్మించిన తాత్కాలిక వంతెన నిర్మాణ పనులు మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా దారి మళ్లించారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు మినహా ఇతర వాహనాలు ప్రత్నామ్యయ మార్గాల్లో రాకపోకలు సాగించేలా తగు ఏర్పాట్లు చేశారు. భారీ వాహనాలు వంతెనపై వెళ్లకుండా బంద్ చేశారు. ఇప్పటికే వంతెన శిథిలావస్థకు చేరడంతో కూలేందుకు సిద్ధంగా ఉంది. ఆర్‌అండ్‌బీ శాఖకు నిధుల కొరత ఉన్నందున పంచాయతీ ఆ పనులు చేపట్టేందుకు అంగీకరించింది. దీనితో పనులు ప్రారంభమయ్యాయి. జాతీయ రహదారి గుండుగొలను వద్ద గల వంతెనపై స్కూలు బస్, లారీలు, వ్యాన్‌లు ఎట్టి పరిస్థితుల్లోను రాకపోకలు సాగించకుండా అడ్డుగా భారికేడ్లను ఏర్పాటు చేశారు. తాత్కాలిక వంతెన తుప్పు పట్టిన నట్లు, అక్కడక్కడ భారీ రంధ్రాలు పడడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నందున ఈ వంతెనకు మరమ్మతులు పనులు చేపడుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య


అన్నేవారిగూడెంలో చిన్నారులను ఒకటవ తరగతిలో చేర్చుకుంటున్న హెచ్‌ఎం షేక్ మస్తాన్, టీచర్లు

భీమడోలు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే చిన్నారులకు ఉత్తమ విద్యాబోధనను అందించే బాధ్యతను ఉపాధ్యాయులుగా తామంతా తీసుకుంటామని అన్నేవారిగూడెం యూపీ పాఠశాల హెచ్ ఎం షేక్ మస్తాన్ అన్నారు. అన్నేవారిగూడెం యూపీ పాఠశాల పరిధిలోని అన్నేవారిగూడెం, కోడూరుపాడు గ్రామాల్లో సోమవారం ప్రత్యేక యూనిఫాంను ధరించిన టీచర్లు ఐదేళ్లు నిండిన చిన్నారుల ఇంటింటికీ వెళ్లి వారి తల్లిదండ్రులను ఒప్పించి అడ్మిషన్లు తీసుకున్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యను అందజేస్తున్నట్లు వారికి హామీ ఇచ్చారు. అన్నేవారిగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు 7గురికి ఒకటవ తరగతిల్లో చేర్పించారు. కోడూరుపాడు ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి ముగించుకున్న ఐదుగురు విద్యార్థులు అన్నేవారిగూడెం యూపీ స్కూల్‌లో చేర్చారు. అదే విధంగా యూపీ పాఠశాలలో ఏడో తరగతి పూర్తి చేసుకున్న 26 మంది విద్యార్థినీ విద్యార్థుల్లో 18 మందిని పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం షేక్ మస్తాన్ మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులు పెరుగుతాయన్నారు. కార్పొరేట్ మోజులో పడి చిన్నారుల బంగారు భవిష్యత్తును నాశనం చేయొద్దని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలున్నాయని, వారికి అవసరమైన ఇంగ్లీష్ విద్యాబోధనను అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్లు విజయకుమారి, స్వర్ణలత, జ్యోతిబస్, దుర్గాప్రసాదిని, ఝాన్సీ, రవిభారతి, శారారాణి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గోనెసంచులు లేక రైతుల ఇబ్బందులు

భీమడోలు: మండలంలోని గుండుగొలనులో రైతులకు గోనె సంచులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని భీమడోలు ఏఎంసీ మాజీ చైర్మన్ వగ్వాల భాస్కర్ జిల్లా ఇంచార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజులకు ఫిర్యాదు చేశారు. గత మూడు రోజులుగా రైతులకు గోనె సంచులు అందజేయకపోవడంతో ధాన్యం సేకరణకు ఆటంకంగా మారిందన్నారు. ఓ పక్క వాతావరణం ఆందోళన కలిగిస్తుందన్నారు. ధాన్యం ఎక్కడబడితే అక్కడ రోడ్లపై ఉందన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గోనె సంచులు పంపిణీ చేయాలని, ధాన్యం త్వరితగతిన సేకరించాలని ఆయన కోరారు.

● మండుటెండలో ఉపశమనం


పినకడిమి-కొప్పాక మార్గంలో ఎండకు గొడుగు పట్టినట్టున్న పచ్చని చెట్లు

భానుడి ప్రతాపానికి ప్రజలు అల్లాడుతున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచే గ్రీష్మతాపం ప్రజలను వేధిస్తోంది. మండుటెంటలో ప్రయాణించే వాహనదారులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పచ్చని చెట్లు నీడన కొద్దిసేపు సేదదీరాలనుకుంటారు. మండంలోని దుగ్గిరాల, పినకడిమి-కొప్పాక రహదారి, స్థానిక బి శింగవరం-కొప్పాకగూడెం, పెదవేగి-కూచింపూడి ఇరువైపులా ఉన్నపచ్చని చెట్లు ఆహ్లాదకరంగా దర్శనమిస్తున్నాయి. పచ్చదనం చక్కటి పూల పరిమాళాలతో చెట్లు కనువిందు చేస్తున్నాయి. ఏళ్ల తరబడి ఉన్న వృక్షాల కొమ్మలు రోడ్డు పైకి బాగా విస్తరించి ప్రయాణికులు ఎండబారిన పడకుండా గొడుగులా నీడనిస్తున్నాయి. - పెదవేగి


దుగ్గిరాల వద్ద చల్లని నీడనిస్తున్న వృక్షాలు


బి శింగవరంలో రోడ్డు ఇరువైపులా నీడనిస్తున్న చెట్లు

మల్టీప్లెక్స్‌లలో ధరల బాదుడు

- అమలుకాని నిబంధనలు
- టికెట్ ధరలు అధికం
- స్నాక్స్, కూల్‌డ్రింక్స్ లూజు అమ్మకాలు
- పార్కింగ్ ఫీజుపై స్పష్టత ఇవ్వని అధికారులు
- దోపిడీని అరికట్టాలంటున్న ప్రేక్షకులు


నగరంలో ఒక థియేటర్ అంతర్భాగం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సినిమా.. సామాన్యుడికి అతిపెద్ద వినోద సాధనం. స్మార్ట్ ఫోన్లు రాకతో సినిమాలన్నీ అరచేతిలో చూసే వెసులుబాటు లభించడంతో థియేటర్లు మూతపడ్డాయి. వీటి స్థానంలో మల్టీప్లెక్స్‌లు ముందుకొచ్చాయి. రాష్ట్రంలోని మల్టీప్లెక్స్‌లన్నీ ఇద్దరు ముగ్గురి చేతుల్లోనే ఉండడంతో ప్రేక్షకులను సైతం శాసించే స్థాయికి చేరాయి. మల్టీప్లెక్స్‌లోకి వెళితే ప్రేక్షకుడు కూడా తనపై తన అ. దీనాన్ని కోల్పోయి, మల్టీప్లెక్స్ నిర్వాహకుల నియంత్రణలోకి వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది.

స్థిరత్వంలేని ధరలు

మల్టీప్లెక్స్‌లో టికెట్ ధరలు ఎప్పుడూ స్థిరంగా ఉండవు. కొత్త సినిమా రిలీజైతే రెండు మూడు రోజులు టిక్కెట్ ధర, అనంతరం సాధారణ స్థితికి వస్తుంది. సినిమా విడుదలైన తొలి రెండు మూడు రోజులూ దాదాపు రూ.400 నుంచి రూ.500, అనంతరం సుమారు రూ.200 వరకు టికెట్ ధర పలుకుతుంది. నేరుగా థియేటర్‌కెళ్లి టిక్కెట్ కొంటే ఒక ధర, ఆన్‌లైన్‌లో తీసుకుంటే మరో ధర ఉంటుంది. గతంలో సినిమా హౌస్‌ఫుల్ అయితే టిక్కెట్లపై సీట్ల నెంబర్లు వేసి దాని ప్రకారం ప్రేక్షకులను కూర్చొబెట్టేవారు. హౌస్‌ఫుల్ కాకపోతే ప్రేక్షకుడు తాను కొన్న తరగతిలో ఎక్కడైనా కూర్చోవచ్చు. ప్రస్తుతం మల్టీప్లెక్స్‌లో ఆన్‌లైన్‌లో టిక్కెట్ కొనుగోలు చేసేటప్పుడే ప్రేక్షకుడు ఇంటర్వెల్‌లో తాను తిని, తాగే పాప్ కార్న్, కూల్ డ్రింక్‌లకు నిర్వాహకులు నిర్ణయించిన ధరకు కొనుగోలు చేస్తే పై వరుసలో సీట్లు కేటాయిస్తారు. లేని పక్షంలో కిందవరుసల్లోనే కూర్చోవాల్సి ఉంటుంది. థియేటర్ ఖాళీగా ఉన్నా ప్రేక్షకుడు తనకు నచ్చిన సీటులో కూర్చొనే స్వతంత్రం కోల్పోతాడు.

దోపిడీకి రాజమార్గం

ఏలూరు నగరంలోని కొన్ని సినిమా థియేటర్లలో స్నాక్స్ పేరుతో ప్రేక్షకులను దోచేయడం పరిపాటిగా మారింది. థియేటర్ వెలుపల కొనుగోలు చేసిన ఏ తినుబండారాలు లోనికి అనుమతించడం లేదు. థియేటర్ క్యాంటీన్లోనే కొనుగోలు చేయాలి. 500 ఎంఎల్ వాటర్ బాటిల్ రూ.50, చిన్న పాప్‌కార్న్ రూ.170, కోల్డ్ కాఫీ రూ.150, పిజ్జా, కోక్ రూ.200, కేక్స్ రూ.80 ఇలా పదుల సంఖ్యలో రకరకాల ఫుడ్ ఐటమ్స్ ఉన్నాయి. ప్రతి ఒక్కటీ కనీసం రూ.100 నుంచి రూ.300 వరకు నిర్ణయించి విక్రయిస్తున్నారు.

ప్యాకింగ్ లేకుండానే విక్రయం

థియేటర్ క్యాంటీన్లో పాప్‌కార్న్, స్వీట్ కేక్స్, సమోసాలతోపాటు ఏ తినుబండారమైనా ప్యాకింగ్ లేకుండా విక్రయిస్తున్నారు. అలా చేస్తే ధర నియంత్రణ ఉండదు. ఒకవేళ వస్తువులు ప్యాకింగ్ చేస్తే ప్యాక్‌పై తయారీ తేదీ నుంచి ముగిసే గడువు తేదీ, తయారీలో వినియోగించే పదార్థాలను ప్రచురించాల్సి ఉంటుంది. ఎమ్మార్పీ కూడా ఉండాలి. ఒకవేళ ఎమ్మార్పీ ఉల్లంఘన జరిగితే తూనికలు, కొలతల శాఖ అధికారులు దాడులు చేసి చర్యలు చేపడతారు. తద్వారా ధరల నియంత్రణ ఉంటుంది. కానీ థియేటర్లలో పాప్‌కార్న్ తయారీ మెషీన్‌తో పాటు దాదాపుగా తినుబండారాలన్నీ ప్యాకింగ్ చేయకుండా ఇష్టం వచ్చిన ధరలకు విక్రయిస్తూ ప్రేక్షకులకు దోచేస్తున్నారు.

పార్కింగ్ ఫీజు వసూలు

సినిమా థియేటర్లు, షాపింగ్ మాల్స్ వద్ద వినియోగదారుల వాహనాలకు ఆయా యాజమాన్యాలే పార్కింగ్ సౌకర్యం కల్పించాలి. కానీ అన్ని థియేటర్లలో పార్కింగ్ ఫీజు చెల్లించకపోతే వాహనాన్ని ఆ స్థలంలో పార్కింగ్ చేయకుండా అడ్డుకుంటున్నారు. దీంతో ప్రేక్షకుడు తప్పనిసరి పరిస్థితిలో పార్కింగ్ ఫీజు చెల్లించాల్సి వస్తోంది. పార్కింగ్ వసతి ఉన్నచోట్ల సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రుసుం వసూలు చేయకూడదు. అయినా థియేటర్ల నిర్వాహకులు యథేచ్ఛగా వాహనదారుల నుంచి ముక్కుపిండి పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారు. ద్విచక్రవాహనానికి రూ.20, కారుకు రూ.40 చొప్పున వసూలు చేస్తున్నా పట్టించుకొనే వారు కరువయ్యారు.

ప్యాకేజీ పేరుతో మోసం

పెద్ద హీరో సినిమా రిలీజ్ అయితే అభిమానుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. తమ అభిమాన హీరో సినిమా రిలీజ్ అవుతుండడంతో ఫ్యాన్స్‌తో పాటు యువత సినిమా థియేటర్లకు వెళ్లి సినిమా చూసేందుకు ఉత్సాహం చూపుతారు. దీంతో తొలి రోజే థియేటర్ల యజమాన్యాలు వారిని దోచేస్తున్నాయి. సినిమా టికెట్‌తో పాటు తినుబండా రాలు కలిపి ప్యాకేజీ పేరుతో ముందుగానే వసూలు చేస్తున్నారు.

తిన్నా, తాగినా జేబులకు చిల్లే



ఇంట్లో ఓటీటీల్లో కొత్త సినిమాలు వస్తున్నా పిల్లలకు మాత్రం థియేటర్‌లోనే సినిమా చూడాలని ఉంటుంది. వారి కోసం తప్పనిసరి పరిస్థిల్లో మల్టీప్లెక్స్‌లకు తీసుకు వెళుతున్నాం. అయితే మల్టీప్లెక్స్‌ల్లో టికెట్ ధరలు సాధారణ థియేటర్లలో ధరల కంటే అధికంగా ఉంటున్నాయి. అలాగే విశ్రాంతి సమయంలో ఏమైనా తినాలన్నా, తాగాలన్నా జేబులకు చిల్లు పడుతోంది. బయట రూ.30 ఉండే కూల్ డ్రింక్ ఇక్కడ రూ.100 పెట్టి కొనాల్సివస్తోంది.

– చిట్టి వెంకటలక్ష్మి, స్థానిక మహిళ

పార్కింగ్ ఫీజులపై స్పష్టత అవసరం



మల్టీప్లెక్స్‌లలో పార్కింగ్ ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని పలు కోర్టులు తీర్పులు ఇచ్చాయని సోషల్ మీడియాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కానీ ఇక్కడ పార్కింగ్‌లో ముక్కుపిండి ఫీజు వసూలు చేస్తున్నారు. అసలు మల్టీప్లెక్స్‌లలో పార్కింగ్ ఫీజు చెల్లించాలా వద్దా అనే దానిపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలి. ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదంటే యాజమాన్యంతోనే నోటీస్ బోర్డు ఏర్పాటు చేయించాలి.

– పి.నాగ విఘ్నేశ్వరరావు, స్థానికుడు